

వినియోగదారుల చట్టంపై అవగాహన పెంచుకోవాలి

ప్రజాశక్తి - పెద్దాపురం

ప్రతి విద్యార్థి వినియోగదారుల చట్టంపై అవగాహన పెంచుకోవాలని వినియోగదారుల సంఘం జిల్లా కమిటీ సభ్యులు బళ్లమూడి సూర్యనారాయణ మూర్తి అన్నారు. గురువారం స్థానిక పాత ఆసుపత్రి వీధిలోని జవహర్ నెహ్రూ మున్సిపల్ హైస్కూల్లో హెచ్ఎం శ్రీదేవి అధ్యక్షతన వినియోగదారుల చట్టం - 2019పై అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్యాస్ డెలివరీ బాయ్‌కి ఐదు కిలోమీటర్ల లోపు అదనంగా ఛార్జీలు చెల్లించవలసిన అవసరం లేదన్నారు. వినియోగదారులు మోసాలకు గురైనట్లు గుర్తిస్తే కాకినాడలోని జిల్లా కన్స్యూమర్ కమిషన్‌లో ఫిర్యాదు చేసి న్యాయం పొందవచ్చన్నారు.

3వ రోజు మరింత ఉధృతం

మోకాళ్లపై నిల్చుని నిరసన

ప్రజాశక్తి - యంత్రాంగం

తమ దీర్ఘకాలిక సమస్యలపై అంగన్‌వాడీలు శాంతియుతంగా ఆందోళన చేస్తుంటే ప్రభుత్వం వారిని రెచ్చగొట్టే చర్యలకు పాల్పడుతోంది. అంగన్‌వాడీ సమ్మెకు ముందు ప్రభుత్వం చర్చలకు పిలిచి సమ్మె చేసే ఉద్యోగాల నుంచి పీకేస్తామని హెచ్చరించింది. అయినా అంగన్‌వాడీలు ప్రభుత్వ హెచ్చరికలను పక్కన పెట్టి ప్రజాస్వామ్య పద్ధతిలో సమ్మెకు శ్రీకారం చుట్టారు. మూడో రోజైన గురువారం ప్రభుత్వ మొండివైఖరిపై మోకాళ్లపై నిల్చుని, కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలిపారు. **కాకినాడ** కాకినాడ అర్బన్‌లో జరుగుతున్న సమ్మె శిబిరాన్ని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కోశాధికారి మిద్దె రమణమ్మ ప్రారంభించారు. యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు జి.బేబీరాణి పాల్గొని మాట్లాడారు. కనీస వేతనాలు అమలు చేయాలని కోరుతున్న అంగన్‌వాడీలపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపాలని చూడడం దారుణం అన్నారు. తెలంగాణ కంటే రూ.1000 వేతనం అదనంగా ఇస్తామన్న హామీని అమలు చేయాలని కోరుతుంటే సిఎం నిరంకుశంగా వ్యవహరిస్తున్నారన్నారు. సమ్మె ఉధృతంగా సాగుతున్న నేపథ్యంలో విచ్ఛిన్నం చేసేందుకు ప్రభుత్వం కుట్ర పన్నుతుందన్నారు. సిఐటియు జిల్లా అధ్యక్షుడు దువ్వా శేషబాబ్జి మాట్లాడుతూ అంగన్‌వాడీల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తున్నారన్నారు. యూనియన్ నాయకత్వంతో చర్చలు జరిపి సమస్య పరిష్కరించకుండా బెదిరింపులకు దిగడం సరికాదన్నారు. సిఐటియు అనుబంధ సంఘాలన్నీ మద్దతుగా నిలబడతాయన్నారు. కాకినాడ అర్బన్ మాజీ ఎంఎల్ఎ వనమాడి కొండబాబు, జనసేన నేతలు సమ్మెనుద్దేశించి మాట్లాడారు. **జగ్గంపేట రూరల్** స్థానిక పంచాయతీ అతిథి గృహం వద్ద ఏర్పాటు చేసిన ధర్నాలో అంగన్‌వాడీలు మోకాళ్లపై నిల్చుని నిరసన వ్యక్తం చేశారు. ఈ శిబిరానికి జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ పాఠంశెట్టి సూర్యచంద్ర పాల్గొని సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ మండల అధ్యక్ష, కార్యదర్శులు రత్నం, సుజాత, జనసేన పార్టీ నాయకులు పాల్గొన్నారు. **కాజులూరులో** నిర్వహించిన సమ్మె శిబిరాన్ని ఉద్దేశించి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డి.పద్మ, ఇ.చంద్రావతి మాట్లాడారు. టిడిపి రామచంద్రపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ రెడ్డి సుబ్రహ్మణ్యం, జనసేన పార్టీ ఇన్‌ఛార్జ్ పోలిశెట్టి చంద్రశేఖర్ పాల్గొని సంఘీభావం తెలిపారు. యూనియన్ నాయకులు వరలక్ష్మి, హనుమావతి, అన్నవరం, టిడిపి మండల అధ్యక్షులు పేపకాయల బాబ్జి పాల్గొన్నారు. **ఏలేశ్వరం** ప్రత్తిపాడు సెక్టార్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీలు ఆందోళనను కొనసాగించారు. **కాకినాడ రూరల్** ఇంద్రపాలెంలో అంగన్‌వాడీ కేంద్రాల తాళాలను సచివాలయం, పంచాయితీ సిబ్బంది పగులకొట్టేందుకు ప్రయత్నించారు. దీంతో సిఐటియు మండల కార్యదర్శి టి.రాజా, నాయకుడు సిహెచ్.విజయకుమార్ అడ్డుకున్నారు. ప్రభుత్వం చర్చలు జరిపి అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సెంటర్ల తాళాలు పగలగొట్టించడం దారుణమన్నారు. **పెద్దాపురం** మున్సిపల్ సెంటర్లో అంగన్‌వాడీలు మోకాళ్లపై నిలబడి నిరసన చేపట్టారు. టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రాజా సూరిబాబు రాజు, పట్టణ టిడిపి అధ్యక్షులు రంది సత్యనారాయణ, నాయకులు సంఘీభావం తెలిపారు. యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి ఎంఎస్‌సి.మూర్తి, మండల కార్యదర్శి కెనడీ నాయకులు, సిపిఎం మండల కార్యదర్శి నీలపాల సూరిబాబు మద్దతు తెలిపారు. ఈ కారక్రమంలో దాడి బేబీ, నాగమణి, అమల, ఎస్తేరు రాణి, ఫాతిమా, తదితరులు పాల్గొన్నారు. **గండేపల్లి** మండలంలో అంగన్‌వాడీలు నిరసనను కొనసాగించారు. ఈ సందర్భంగా యూనియన్ మండల అధ్యక్షురాలు రాజేశ్వరి మాట్లాడారు. సెంటర్ల తాళాలను పగులకొట్టించడం దారుణమన్నారు. **ఏలేశ్వరం** ఐసిడిఎస్ సెక్టార్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీలు మోకాళ్లపై నిలబడి నిరసన తెలిపారు. ఏలేశ్వరం, ప్రత్తిపాడు మండలాల సిఐటియు కార్యదర్శులు పాకలపాటి సోమరాజు, రొంగల ఈశ్వరరావు పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు కాకరపల్లి సునీత, కె.హేమలత, టి.నాగవరలక్ష్మి, మరియ, గంగాభవాని పాల్గొన్నారు. **పెదపూడి** స్థానిక ఎంపిడిఒ కార్యాలయం వద్ద జరుగుతున్న అంగన్‌వాడీల ఆందోళన కార్యక్రమంలో ఐద్వా నాయకులు సిహెచ్.రమణి పాల్గొని మద్దతు తెలిపారు. మహిళా సాధికారికతే ధ్యేయం అని చెబుతున్న ప్రభుత్వం అంగన్‌వాడీల సమస్యలను ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో ఎం. రాజేశ్వరి, వి.భారతి, టి.వేణు, ఎ.కనకదుర్గ పాల్గొన్నారు. **పిఠాపురం** ఐసిసెస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద అంగన్‌వాడీల నిరసన శిబిరం కొనసాగింది. ఈ సందర్భంగా ప్రాజెక్టు ప్రధాన కార్యదర్శి డి.తులసి, సిఐటియు నాయకులు కె.చిన్న మాట్లాడారు. జెవివి నాయకులు ఎన్.సూర్యనారాయణ, జనసేన పార్టీ నాయకులు సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు కె.విశ్వనాథం. అంగన్‌వాడీ యూనియన్ నాయకలు కె. సత్యవతి, బేబీరాణి, విజయ శాంత, తదితరులు పాల్గొన్నారు.





ఏలేశ్వరం ఐసిడిఎస్ కార్యాలయం వద్ద కళ్లకు గంతలు కట్టుకుని మోకాళ్లపై నిలబడి నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

అంగన్‌వాడీల డిమాండ్లు నెరవేర్చాలి : సిపిఎం

ప్రజాశక్తి - కాకినాడ

అంగన్‌వాడీల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించి సమ్మెను విరమింపజేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి సిపిఎం కాకినాడ జిల్లా కమిటీ విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు సిపిఎం జిల్లా కన్వీనర్ ఎం.రాజశేఖర్ గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. అంగన్‌వాడీల సమ్మెకు సిపిఎం సంపూర్ణ మద్దతు ఇస్తుందన్నారు. ప్రభుత్వ విచ్ఛిన్నకర ఎత్తుగడలను ఎదుర్కొని కార్మికులు, ఉద్యోగులు ఐక్యంగా నిలబడాలని, పార్టీలకు అతీతంగా అన్ని వర్గాల తరగతుల ప్రజలు, ప్రజాతంత్రవాదులు అంగన్‌వాడీలకు సంఘీభావంగా నిలబడాలని కోరారు. నాలుగేళ్లుగా హామీలు అమలు చేయాలని కోరినా ఫలితం లేదన్నారు. దీంతో చివరకు వారు సమ్మెకు దిగారని తెలిపారు. ఈ సమ్మెను నివారించే అవకాశం ఉన్నా ప్రభుత్వం బాధ్యతారహితంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. జిల్లాలో అనేక చోట్ల ప్రభుత్వ అధికారులు, సచివాలయ ఉద్యోగులు అంగన్‌వాడీల కేంద్రాల తాళాలు పగులగొట్టి చట్ట విరుద్ధంగా స్వాధీనం చేసుకుంటున్నారని, దీనిని సిపిఎం తీవ్రంగా ఖండిస్తుందన్నారు.

అధికారులను అడ్డుకున్న లబ్ధిదారులు

ప్రజాశక్తి - సామర్లకోట రూరల్, యు.కొత్తపల్లి

అంగన్‌వాడీ కేంద్రాలను తెరిచేందుకు ప్రయత్నించిన సచివాలయ సిబ్బంది, ఆర్‌పిలను లబ్ధిదారులైన మహిళలు అడ్డుకున్నారు. కొన్ని కేంద్రాలు మినహా మిగిలిన కేంద్రాలన్నీ అద్దె గృహాల్లో నడుస్తున్న నేపథ్యంలో అధికారుల ప్రయత్నానికి గహాల యజమానులు, పరిసర ప్రాంత లబ్ధిదారులు అడ్డుకున్నారు. అంగన్‌వాడీలు సమ్మెలో ఉంటే కేంద్రాలను తెరవడం సరికాదని వారు అధికారులను వారించారు. దీంతో చేసేది లేక అధికారులు ప్రయత్నాలను విరమించుకున్నారు. స్థానిక సంగీతరావుపేట అంగన్‌వాడీ కేంద్రం వద్ద పరిస్థితిని మున్సిపల్ కమిషనర్ జె.రామారావు పరిశీలించారు. యు.కొత్తపల్లి మండలంలోని వాకతిప్ప అంగన్‌వాడీ కేంద్రం తాళాలను పగలగొట్టేందుకు వచ్చిన సచివాలయ సిబ్బందిని వారు అడ్డుకుని పగులకొడితే సహించేది లేదని హెచ్చరించారు. తాళాలు పగలకొట్టినా పిల్లలను పంపేది లేదని తేల్చిచెప్పారు. అయితే పలు అంగన్‌వాడీ కేంద్రాలను సచివాలయ సిబ్బంది, అధికారులు తాళాలు పగలకొట్టి ఆయా కేంద్రాల్లోకి ప్రవేశించారు.



యు.కొత్తపల్లి మండలం వాకతిప్పలో తాళం పగులగొట్టేందకు వచ్చిన అధికారులను అడ్డుకుంటున్న లబ్ధిదార మహిళలు

అంగన్‌వాడీ కేంద్రాల ఆక్రమణ

సమ్మెకు వ్యతిరేకంగా ప్రభుత్వం దుశ్చర్య

ప్రజాశక్తి - యంత్రాంగం

అంగన్‌వాడీ కేంరదాలను అక్రమించేందుకు ప్రభుత్వ ప్రయత్నాలు మొదలు పెట్టింది. ఉద్యమాన్ని అణచివేసేందుకు అధికారయంత్రాంగంతో దుశ్చర్యలకు దిగుతోంది. ఇందులో భాగంగా కేంద్రాల తాళాలలు పగులగొట్టించింది. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు సైతం భాగస్వాములు అయ్యారు.

జగ్గంపేట రూరల్ మండల పరిషత్, రెవెన్యూ, పంచాయతీ అధికారులు మండలంలోని అంగన్‌వాడీ సెంటర్లకు వేసిన తాళాలను పగులకొట్టారు ఒక మహిళను ఇన్‌ఛార్జ్‌గా నియమించి బలవంతంగా చిన్నారులను రప్పించి భోజనం పెట్టారు. **ఏలేశ్వరం** ప్రభుత్వ కవ్వింపు చర్యల్లో భాగంగా ప్రత్తిపాడు మండలంలోని 11 అంగన్‌వాడీ కేంద్రాలకు చెందిన తాళాలను సచివాలయ సిబ్బందితో బద్దలు కొట్టించారు. ఏలేశ్వరం మండలంలో 8 సెంటర్లకు సంబంధించిన తాళాలను బద్దలు కొట్టించారు. **కరపలో** తాళాలు పగలగొట్టి అంగన్‌వాడీ సెంటర్లను తెరిపించడంపై అంగన్‌వాడీ కార్యకర్తలు ఎస్ఐ ఎన్.రామకృష్ణకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా కాకినాడ రూరల్ సెక్టర్ నాయకులు పి.వీరవేణి మాట్లాడుతూ తమ సమస్యల పరిష్కారం కోసం ఆందోళన చేస్తున్నామని, అయితే తమ ప్రమేయం లేకుండా కొందరు అంగన్‌వాడీ కేంద్రాల తాళాలను పగలగొట్టినట్లు తమకు తెలిసిందన్నారు. రికార్డులు, సామాన్లు ఉపోతే పూర్తి బాధ్యత తాళాలు పగలగొట్టిన వారిదేనన్నారు. వారిని బాధ్యులుగా చేయాలని ఎస్ఐని కోరారు. ఎస్ఐని కలిసి ఫిర్యాదు చేసిన వారిలో ఎస్ వరలక్ష్మి, నారాయణమ్మ, కె.కల్పలత, జ్యోతి, హైమ, సిహెచ్ సూర్యకుమారి, విజయ రత్నం, తదితరులు పాల్గొన్నారు. **తాళ్లరేవు** మండలంలో పలుచోట్ల అంగన్‌వాడీ కేంద్రాలను వైసిపి నాయకులు, సచివాలయ సిబ్బంది తాళాలు పగలగొట్టి తెరిచారు. కోరంగి పంచాయతీ సీతారామపురంలో పంచాయతీ కార్యదర్శి రామరాజు, వైసిపి నాయకులు కాదా గోవిందకుమార్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కేంద్రాన్ని తెరిచారు. జార్జిపేటలో సచివాలయ సిబ్బంది, వైసిపి నాయకులు రెడ్డి నాగేశ్వరరావు, పెట్ల సూర్యనారాయణరాజు, చొల్లంగిపేటలో మైదు హరిబాబు, సచివాలయ సిబ్బంది తాళాలను పగులగొట్టారు.

జగన్ పాలనలోనే సంక్షేమం

ప్రజాశక్తి - రౌతులపూడి

సిఎం జగన్ పాలనలోనే ప్రజలకు సంక్షేమం సాధ్యమని మండల పరిషత్ కో-ఆప్షన్ సభ్యులు చింతకాలయ వీర వెంకట సత్యనారాయణ అన్నారు. మండలంలోని బలరాంపురం గ్రామంలో వై ఎపి నీడ్ జగన్ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేనివిధంగా ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని అన్నారు. ఒకపక్క సంక్షేమం, మరోపక్క అభివృద్ధిని చేపడుతూ గ్రామాల అభివృద్ధికి పాటుపడుతుందన్నారు. ప్రతీ సంక్షేమ పథకం ఫలితాన్ని నేరుగా మహిళల బ్యాంకు ఖాతాల్లోనే అందిస్తూ వారి అభివృద్ధికి కృషి చేస్తుందన్నారు. అందుకే మరోసారి సిఎంగా జగన్ రావాలని అన్నారు. ఈ సందర్భంగా పలువురు లబ్ధిదారులకు కొండపోడు భూములకు సంబంధించిన పట్టాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు శ్రీను, సర్పంచ్ పైల సీత, నాయకులు అచ్చారి సాంబమూర్తి, కాకి సత్యనారాయణ, సీతారామస్వామి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక మహారాణి కళాశాల సబ్ స్టేషన్ నుంచి బ్యాంకు కాలనీ, పెద్దాపురం నుంచి వచ్చే సిరివాడ ఫీడర్స్ మరమ్మత్తులు కారణంగా ఈ నెల 15 వ తేదీ ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు వడ్లమూరు గ్రామంలో విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని ఎఇ ఎవిఎన్‌డిఎస్.ప్రభాకర్ తెలిపారు. దీనిని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

కదం తొక్కిన ఆశాలు

- కనీసవేతనం రూ.26 వేలు చెల్లించాలి
- 36 గంటల ధర్నాలో వంటా.. వార్పు

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

ఎన్నో ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న ఆశాల కార్యకర్తల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ రెండురోజులపాటు చేపట్టిన 36 గంటల నిరసన కార్యక్రమానికి ఆశా కార్యకర్తలు కాకినాడలో కదం తొక్కారు. నిరంతరం పని ఒత్తిళ్ల మధ్య విధులు నిర్వర్తిస్తున్నా వైసిపి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందంటూ వారు నిరసన గళం విప్పారు. కనీస వేతనాలు ఇవ్వాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఆరోగ్య సేవలు అందించడంలో కీలకంగా పనిచేస్తున్న ఆశలకు రూ.26 వేలు కనీస వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఆశ వర్కర్లు ఆందోళనకు దిగారు. ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు 36 గంటలపాటు కలెక్టరేట్ దగ్గర గురువారం ధర్నా కార్యక్రమాన్ని ప్రారంభించారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు దువ్వా శేషబాబ్జి ధర్నాను ప్రారంభించి మాట్లాడారు. జగన్ నాలుగున్నరేళ్ల పాలనలో ధరలు 500 శాతం పెరిగాయని, జీతాలు మాత్రం పెరగలేదని విమర్శించారు. అన్ని రాష్ట్రాల కంటే ఆంధ్రప్రదేశ్‌లో నిత్యవసర సరుకుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని, అందుకు జగన్ వేసే అదనపు పన్నులే కారణమన్నారు. ప్రాణాలకు తెగించి కోవిడ్ కాలంలో పనిచేసిన ఆశా కార్యకర్తలకు కనీస వేతనాలు చెల్లించకుండా జగన్ ప్రభుత్వం శ్రమదోపిడి చేస్తుందని మండిపడ్డారు. తక్షణం ప్రతి ఆశా కార్యకర్తకు రూ.26 వేలు కనీస వేతనం అమలు చేయాలని, రూ.10 లక్షలు గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని, ఆన్‌లైన్ పేరుతో వేధింపులు ఆపి, పని భారాన్ని తగ్గించాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నర్ల ఈశ్వరి, చంద్రమళ్ల పద్మ, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్కల రాజ్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులుగా ఆశాలను పరిగణించి సంక్షేమ పథకాల నుంచి దూరం పెడుతూ, వేతనాలు చెల్లించేటప్పుడు ఆశాలను గౌరవవేతనం పేరుతో పిఆర్‌సి అమలు కాకుండా జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం రెండు నాల్కల ధోరణితో వ్యవహరించడం సిగ్గు చేటన్నారు. తక్షణం ఆశాలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి పిఆర్‌సి అమలు చేయాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్, పెన్షన్ ఇవ్వాలని, గ్రాడ్యుటి అమలు చేయాలని, చనిపోయిన ఆశా కుటుంబంలో ఒక్కరికీ ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని, రిటైర్మెంట్ వయసు 62 సంవత్సరాలు ఆశలకు వర్తింప చేయాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నా శిబిరానికి టిఎన్‌టియుసి జిల్లా అధ్యక్షులు గదుల సాయిబాబు, ఎపిఎంఎస్‌ఆర్‌యు రాష్ట్ర కోశాధికారి దుంపల ప్రసాద్, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు తిరుమలశెట్టి నాగేశ్వరరావు, జిజిహెచ్ శానిటేషన్ వర్కర్స్ యూనియన్ నాయకులు విజయ్ కుమార్, మెస్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఏచూరి శ్రీనివాస్ మద్దతుగా మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రాయుడు రమేష్, చివుకుల వెంకటరావు, వెంకన్న, స్వామి, రాయుడు నాగలక్ష్మి, మడికి లక్ష్మి, ముప్పిడి ఆశాజ్యోతి, భారతి, అంకాడి పద్మావతి, మలకా నాగలక్ష్మి, చెక్కల వేణి పాల్గొన్నారు.



ఆశా కార్యకర్తల 36 గంటల దీక్షలో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా అధ్యక్షులు దువ్వా శేషబాబ్జి

సంక్షేమం, అభివృద్ధి జగన్‌తోనే సాధ్యం



సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న ఎంపిపి సునీత గంగాధర్, తదితరులు

ప్రజాశక్తి - తాళ్లరేవు

సంక్షేమం, అభివృద్ధి సిఎం జగన్మోహన్ రెడ్డితోనే సాధ్యమని ఎంపిపి రాయుడు సునీత గంగాధర్ అన్నారు. ఉప్పంగల గ్రామంలో సర్పంచ్ శాకా శంకరుడు అధ్యక్షతన వై ఎపి నీడ్ జగన్ కారక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ గ్రామానికి సుమారు రూ.22.20 కోట్లు లబ్ది చేకూరిందని తెలిపారు. ఈ సందర్భంగా పథకాలకు సంబంధించిన బోర్డును ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి ఛైర్మన్ కుడుపూడి శివన్నారాయణ ఎంపిటిసి సభ్యులు కాదా శ్రీనివాస్, సొసైటీ అధ్యక్షులు దవులూరి శ్రీరామ్మూర్తి, గ్రామ కమిటీ కన్వీనర్ అనిశెట్టి శ్రీనివాసరెడ్డి, ఉప సర్పంచ్ ముడికి సుజాత, మట్టపర్తి నాగేశ్వరరావు, చెల్లుబోయిన శ్రీనివాస్, గ్రామపంచాయతీ కార్యదర్శి వరలక్ష్మి పాల్గొన్నారు.

హుండీల ఆదాయం రూ 29,17,243

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని తిరుపతి గ్రామంలోని శృంగార వల్లభ స్వామి ఆలయంలోని 90 రోజులకు సంబంధించిన హుండీలను గురువారం లెక్కించగా రూ 29,17,243 ఆదాయం సమకూరిందని ఆలయ కార్యనిర్వహణాధికారి పులి నారాయణమూర్తి తెలిపారు. దేవాదాయ శాఖ అధికారులు పి.బాబురావు, ఎంఎం.వీరభద్రరావు సమక్షంలో హుండీలను తెరిచి లెక్కించారన్నారు. జనరల్ హుండీ ద్వారా రూ.23,54,714, అన్నదానం హుండీల ద్వారా రూ.5,62,530 సమకూరిందన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ కర్రి వెంకట జగదీశ్వరరావు, ధర్మకర్తలు, ఎంపిటిసి సభ్యులు కుంచే బుచ్చిరాజు, కుంచె వెంకన్న, సిబ్బంది, స్వచ్ఛంద సేవకులు పాల్గొన్నారు.




హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది

వృద్ధులకు గొంతు సమస్యలు ఉత్పన్నం

ప్రజాశక్తి - కాకినాడరూరల్

శీతాకాలంలో తేమ శాతం అధికంగా ఉండి మంచు కురవడం వల్ల వృద్ధులకు గొంతుకు సంబంధించిన సమస్యలు ఉత్పన్నం అవుతాయని ప్రానిక్ హీలింగ్ వైద్యురాలు ఎం.వరలక్ష్మి అన్నారు. స్థానిక ఎపిఐఐసి కాలనీ అడబాల ట్రస్ట్ కార్యాలయంలో వరలక్ష్మి సౌజన్యంతో వృద్ధులకు దుప్పట్లు పంపిణీ జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తేమ శాతాన్ని అధిగమించడానికి వేడి నీటిని తీసుకోవాలని అన్నారు. గొంతులో ఇన్‌ఫెక్షన్ వస్తే మంచినీటిని ఎక్కువగా తాగాలని అన్నారు. ఈ కాలంలో వృద్ధులు మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్మీ విశ్రాంతి ఉద్యోగి ఎస్.శ్రీ నగేష్, అడబాల రత్నప్రసాద్, సూర్య, రాజా, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.


కార్టూ'నిజం'



రీసర్వే పనుల వేగవంతానికి చర్యలు

ప్రజాశక్తి - కాకినాడ

జగనన్న భూ హక్కు, భూ రక్ష పథకం కింద చేపట్టిన మూడవ దశ రీసెర్వే పనులు వేఘవంతం చేసి డిసెంబర్ నెల చివరి నాటికి పూర్తిచేసేలా అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కెఎస్.జవహర్ రెడ్డి గురువారం అమరావతి నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టరేట్ నుంచి జెసి ఇలక్కియాతో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ భూ రికార్డుల స్వచ్ఛీకరణలో భాగంగా సమగ్ర భూ సర్వే పనులపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి ప్రభుత్వం నిర్దేశించిన గడువులోపు పూర్తి చేయాలన్నారు. జిల్లాలో మూడో దశ రీసర్వే కింద 16 మండలాల్లో 90 గ్రామాల్లో చేపట్టడం జరిగిందన్నారు. తుపాను ప్రభావంతో దెబ్బతిన్న వ్యవసాయ, ఉద్యాన పంటల వివరాలు సక్రమంగా నమోదు చేయాలని తెలిపారు. జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు జరుగుతున్న నేపథ్యంలో తేమ శాతంలో రైతులకు ఇబ్బందులు పడకుండా ధ్యానం కొనుగోలు కేంద్రాలకు అనుసంధానం చేసిన, రైస్ మిల్లర్లను పర్యవేక్షించాలన్నారు. కనీస మద్దతు ధర రైతులు అందరూ సద్వినియోగం చేసుకునేలా రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ సమావేశంలో జడ్‌పి సిఇఒ ఎ.రమణారెడ్డి, పశు సంవర్ధక శాఖ జెడి ఎస్. సూర్యప్రకాశరావు, డిపిఒ భారతి సౌజన్య, డ్వామా పీడీ ఎ.వెంకటలక్ష్మి, ఎడి సర్వే బి.లక్ష్మీనారాయణ, డిసిఒ దుర్గాప్రసాద్, డిఎస్ఒ ఎంవి.ప్రసాద్, ఎడి మార్కెటింగ్ నారాయణరావు, గ్రామీణ నీటి సరఫరా, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ కృతికా శుక్లా

అథ్లెటిక్స్ పోటీలకు ఏర్పాట్లు పూర్తి

ప్రజాశక్తి - గండేపల్లి

కాకినాడ జెఎన్‌టియుకె పరిధిలోని అంతర్ కళాశాల మెన్ అండ్ వుమెన్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్-2023 పోటీలకు సూరంపాలెం ఆదిత్య ఇంజనీరింగ్ ప్రాంగణంలో ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆదిత్య క్యాంపస్ డైరెక్టర్, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఈ నెల 16, 17 తేదీల్లో అథ్లెటిక్స్ విభాగంలో వివిధ పోటీలు పాల్గొనేందుకు 350 మంది పురుష, 150 మంది మహిళా క్రీడాకారులు పాల్గొననున్నారని ఆయన తెలిపారు. 21 మంది ఆదిత్య ఫిజికల్ డైరెక్టర్ల పర్యవేక్షణలో పోటీలు పూర్తి నిష్పక్షపాతంగా, స్నేహపూర్వక వాతావరణంలో నిర్వహించనున్నట్లు చెప్పారు ఇప్పటికే 41 కళాశాలలకు చెందిన 362 మంది క్రీడాకారులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారని, ఈ క్రీడల్లో పాల్గొనే క్రీడాకారులకు వసతి, భోజన సౌకర్యాన్ని కల్పిస్తున్నామని తెలిపారు. క్రీడాకారులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆదిత్య విద్యాసంస్థల వైస్ ఛైర్మన్ డాక్టర్ ఎన్.సతీష్‌రెడ్డి తెలిపారు. ఈ పోటీలో జెఎన్‌టియుకె పరిశీలకులు డాక్టర్ జిపి.రాజు, శ్యామ్ తదితరులు పర్యవేక్షణలో జరుగుతాయని కార్యనిర్వాహక కార్యదర్శి జివి.ప్రతాప్ రెడ్డి తెలిపారు.



రన్నింగ్ ట్రాక్‌ను తయారు చేస్తున్న సిబ్బంది

పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి



వ్యవసాయ అధికారికి తన ఆవేదనను వ్యక్తం చేస్తున్న రైతు

ప్రజాశక్తి - సామర్లకోట రూరల్

తుపాన్ ప్రభావంతో నష్టపోయిన రైతులను ప్రభుత్వం నష్ట పరిహారం ఇచ్చి ఆదుకోవాలని మున్సిపల్ మాజీ వైస్ ఛైర్మన్ యార్లగడ్డ రవిచంద్ర ప్రసాద్, రైతులు నిమ్మలపూడి ఉదయ్, సానా నారాయణరావు కోరారు. మండల వ్యవసాయ అధికారి ఐ.సత్యను కలిసి రైతుల బాధను గురువారం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాజేటి నగర్ సమీపంలో సుమారు 50 ఎకరాల వరి పంట తుపాన్ వల్ల నాశనం అయ్యిందని తెలిపారు. తమ ప్రాంతంలో చిన్న, సన్నకారు, కౌలు రైతులు అధికంగా ఉన్నారని తెలిపారు. దీంతో మండల వ్యవసాయ అధికారి సత్య రైతు భరోసా కేంద్రం నుంచి సిబ్బందిని పంపించి ధాన్యాన్ని పరిశీలించారు.

నత్తనడకన అమృత్ పథకం

▶ నిధుల కేటాయింపులో ప్రభుత్వ నిర్లక్ష్యం ▶ మురుగునీటి శుద్ధి కరువు

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి


జిల్లాలో పట్టణాలు, కాకినాడ నగరపాలక సంస్థలో మురుగునీటి కాలువల వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో ప్రజలు అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. మురుగునీటి వలన రోగాలతో సతమత మవుతున్నారు. వర్షం వస్తే తీవ్ర దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నారు. సరైన ప్రణాళికలు లేకపోవడంతో ఈ సమస్య పట్టణవాసులను నిత్యం వెంటాడుతుంది. పట్టణాల్లో మురుగు నీటిని శుద్ధిచేసే నీటి, వాయు కాలుష్యం లేకుండా చేయాలనే లక్ష్యంతో కేంద్రప్రభుత్వం అమృత్ పథకాన్ని అమలు చేస్తోంది. ఈ పథకం క్షేత్రస్థాయిలో సక్రమంగా అమలుకు నోచుకోవడం లేదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అరకొర నిధులనే కేటాయింపులు చేయడంతో పట్టణవాసులు మురుగునీటి సమస్యను ఎదుర్కోక తప్పని స్థితి నెలకొంది. అమృత్ 2.0 పథకంలో 2016-20 మధ్య కాలంలో కాకినాడ నగర పాలక సంస్థ, మున్సిపల్ కేంద్రాల్లో సివేజ్ అండ్ ట్రీట్ మెంట్(ఎస్‌టిపి) ప్లాంట్లను మంజూరు అయ్యాయి. ఈ ప్లాంట్ల నిర్మాణానికి అయ్యే ఖర్చులో స్థానిక సంస్థలు 50 శాతం, కేంద్రం 30 శాతం, రాష్ట్రం 20 శాతం కేటాయింపులు చేయాల్సివుంది.


పిఠాపురంలో నిరుపయోగంగా ఉన్న ఎస్‌టిపి ప్లాంట్ నిర్మాణానికి కేటాయించిన స్థలం

ఏళ్ల తరబడి సమస్య

కాకినాడ నగరంలో మురికినీరు శుద్ధి కోసం అప్పటి ప్రధాని పి.వి.నరసింహారావు పాలన నుంచి సెలక్షన్ గ్రేడ్ మున్సిపాలిటీ స్థాయిలో ఉన్న కాకినాడలో అప్పటి మున్సిపల్ ఛైర్మన్ జ్యోతుల సీతారామమూర్తి నుంచి కృషి జరిగింది. అనంతరం ఏర్పడిన ప్రభుత్వాలు పెద్దగా దృష్టి సారించలేదు. ప్రస్తుతం అమృత్ పథకం కాకినాడ నగరానికి వర్తించినా మురుగునీటి శుద్ధి మాత్రం కన్పించడం లేదు. ఇందుకు ప్రధానం నిధుల కొరతేనన్న అభిప్రాయం వ్యక్తం అవుతోంది. ప్రస్తుతం నగరంలో రోజుకు 50 మిలియన్ లీటర్ల వ్యర్థ జలాలు వృద్ధి చెందుతున్నాయి. వీటిని శుద్ధి చేయకుండానే సముద్రంలోకి విడుదల చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఏటిమొగ వద్ద 5 ఎంఎల్‌డి సామర్థ్యంతో వ్యర్థ జలాల శుద్ధి కేంద్రం(ఎస్‌టిపి)ను 5 ఏళ్ల క్రితం నిర్మాణం చేపట్టారు. అయితే నేటికీ పూర్తి కాలేదు. ఇప్పటి వరకు 60 శాతం పనులు మాత్రమే పూర్తియ్యాయని అధికారులు చెబుతున్నారు. చైనా నుంచి కీలక యంత్రం రావడంలో ఆలస్యం జరుగుతోందని అధికారులు కొవిడ్‌ను బూచీగా చూపారు. ప్రస్తుతం పరిస్థితులు అనుకూలంగా ఉన్నా సమస్యకు మాత్రం పరిష్కారం లభించడం లేదని పరిశీలకులు పేర్కొంటున్నారు. ఎస్‌టిపి ప్లాంట్ నిర్మాణానికి మరో రెండేళ్లు సమయం పట్టే అవకాశం ఉందనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. ప్రస్తుతం నగర వ్యాప్తంగా మురుగు నీరు ఉప్పు టేరు నుంచి సముద్ర తీరానికి చేరుతోంది. తూర్పు వైపున పోర్టు నుంచి సంతనపురి కాలనీ వరకు మురుగు నీరు రైల్వే ట్రాక్ దిగువ నుంచి విడుదల అవుతోంది. మిగులు వ్యర్థ కాలుష్య రసాయన పదార్థాల కలయికతో మురుగు నీరు శుద్ధి లేకుండా వదిలివేయడం వలన భూగర్భ జలాలకు చేరి కలుషితమవుతున్నాయని నగర వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రూరల్ ప్రాంతంలోని వలసపాకల వంటి గ్రామాల్లో భూగర్భ నీరు కలుషితం అయ్యినట్లు వచ్చిన ఫిర్యాదులతో నీటిని పరీక్షలకు పంపించారు. అయితే ఆ నీటి పరీక్షలకు సంబంధించిన నివేదికను నేటికీ బహిర్గతం చేసిన పరిస్థితి లేదు. మురుగు శుద్ధి లేని ప్రవాహం వలన అనారోగ్యాలు, చర్మ వ్యాధులు వస్తున్నాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు. జాతీయ హరిత ట్రిబ్యునల్ ప్రకారం పర్యావరణ పరిరక్షణ కోసం జనాభాకు తగిన చెత్త, మురుగు శుద్ధి ఉండాలని చెబుతున్నా అధికారులకు పట్టడం లేదు. పిఠాపురం పురపాలక సంఘంలో డ్రైవర్స్ కాలనీలో 1 ఎంఎల్‌డి, అగ్రహారంలో 1.1 ఎంఎల్‌డి సామర్థ్యంతో శుద్ధి కేంద్రాలను ఏర్పాటు చేయాలని ప్రతిపాదనలు పంపారు. రెండు చోట్ల 40 సెంట్లు చొప్పున స్థలాన్ని కేటాయించారు. అయితే నేటికీ ఈ పనులు ప్రారంభం కాలేదు. ఏడాదిలో ప్రారంభ మయ్యే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. అలాగే సామర్లకోట మున్సిపాలిటీలో రూ.2.96 కోట్లు, రూ.23.26 కోట్లతో రెండు చోట్ల పనులు ప్రారంభించాలని ప్రతిపాదనను తయారుచేసి కౌన్సిల్ ఆమోదానికి ఉంచారు. అటు పెద్దాపురం, తుని, పురపాలక సంఘాలలో అమృత్ పథకం పనులు ప్రారంభానికి నోచుకోలేదు.

శుద్ధి కేంద్రాలను ఏర్పాటు చేయాలి



ముంపు నగరంగా మారిన కాకినాడలో మురుగు శుద్ధి కేంద్రాలు తక్షణమే ఏర్పాటు చేయడం అత్యవసరంగా గుర్తించాలి. పరిసర గ్రామాలను కలుపుకుని విస్తృత స్థాయిలో పౌర సౌకర్యాల కల్పనకు మేజర్ ప్రాజెక్ట్‌గా చెత్త నుంచి విద్యుత్ ఉత్పత్తి చేసే డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేయాలి. మురుగు శుద్ధి కేంద్రాలు ఏర్పాటు చేయడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్థానిక నిధుల తోడ్పాటుతో నిర్మించాల్సిన అవసరం ఉంది.

-దూసర్లపూడి రమణరాజు, పౌర సంక్షేమ సంఘం కన్వీనర్, కాకినాడ

స్టడీ మెటీరియల్ పంపిణీ


విద్యార్థికి పుస్తకాలను అందిస్తున్న రఘునాయకానందస్వామి

ప్రజాశక్తి - సామర్లకోట రూరల్

పదో తరగతి రాసే విద్యార్థులకు వేట్లపాలెం శ్రీ రామకృష్ణ సేవాసమితి మందిరంలో యుటిఎఫ్ రూపొందించిన స్టడీ మెటీరియల్‌ను గురువారం పంపిణీ చేశారు. వేట్లపాలెం జి.మేడపాడు, పెద్ద బ్రహ్మదేవం, మర్రిపూడి, ఎల్లపల్లి పాఠశాలలకు చెందిన 325 మంది విద్యార్థులకు దాతలు గోలివాను కందుల సతీష్, లక్ష్మీ మాధవ్ ఆర్థిక సహకారంతో పంపిణీ చేశారు. చెన్నయ్ రామకృష్ణ మిషన్ రఘునాయకానంద స్వామి చేతుల మీదుగా వీటిని అందించారు. వండిగోడ్ ట్రిపుల్ ఐటి ప్రొఫెసర్ కొండపల్లి రామచంద్రశేఖర్ విద్యార్థులకు పరీక్షలపై అవగాహన కల్పించారు. శ్రీకృష్ణ సాయి మాట్లాడుతూ సైన్స్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సేవ సమితి నాయకులు వివేకానంద ట్యుటోరియల్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నీలపల్లి హైస్కూల్లో మండల స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్


ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న ఎంపిపి సునీత

ప్రజాశక్తి - తాళ్లరేవు

నీలపల్లి జడ్‌పి హైస్కూల్‌లో మండల స్థాయి విద్య, వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించారు. ఈ ప్రదర్శనను ఎంపిపి రాయుడు సునీత ప్రారంభించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం రాధాకృష్ణ అధ్యక్షతన జరిగిన సభలో ఆమె మాట్లాడారు. విద్యార్థుల సజనాత్మకతను వెలికి తీసేందుకు ఈ వైజ్ఞానిక ప్రదర్శనలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ఎఎంసి ఛైర్మన్ కుడుపూడి శివన్నారాయణ మాట్లాడుతూ విద్యార్థులు ముందుగా లక్ష్యాన్ని నిర్దేశించుకుని ఆ మేరకు నిరంతరం ప్రయత్నం చేయాలని తెలిపారు. విద్యార్థులు ప్రదర్శించిన పలు ప్రాజెక్టులు పలువురిని ఆలోచింపజేశాయి. ఈ కార్యక్రమంలో జడ్‌పిటిసి సభ్యులు దొమ్మేటి సాగర్, విద్యాశాఖ అధికారి ఉమ, స్థానిక సర్పంచ్ చిట్టూరి నాగమణి, రెడ్డి సతీష్, కట్ట దుర్గారావు, గుత్తుల సూర్యనారాయణ, ఎంపిటిసి సభ్యులు సూరిబాబు, ఉప సర్పంచ్ వస్కా రెడ్డి, మండలంలోని పలు పాఠశాలలకు చెందిన విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాఠశాల మౌలిక వసతులకు 'యుడైస్ ప్లస్' ఆధారం

ప్రజాశక్తి -సామర్లకోట రూరల్

పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు యుడైస్ ప్లస్ వెబ్‌సైట్‌లో నమోదైతే ఆయా పాఠశాలకు కేంద్ర ప్రభుత్వం గ్రాంట్లు విడుదలకు అవకాశం ఉంటుందని ఎంఇఒ-2 పి.పుల్లయ్య తెలిపారు. గురువారం సామర్లకోట పట్టణంలోని మేరీ ఇమ్మాక్యులేట్ హైస్కూల్లో యునిఫైడ్ డిస్ట్రిక్ట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ ఫర్ ఎడ్యుకేషన్‌పై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పుల్లయ్య మాట్లాడారు. ఈ వెబ్‌సైట్‌లో పాఠశాలకు సంబంధించిన మౌలిక సదుపాయాలు, ఉపాధ్యాయులు, పిల్లల వివరాలు, భౌగోళిక పరిస్థితులను పొందుపరచాలన్నారు. యుడైస్ ప్లస్‌లో నమోదు చేయాల్సిన అంశాలను కంప్యూటర్ ఆపరేటర్ సుబ్రహ్మణ్యం వివరించారు. ఈ సమావేశంలో ఉపాధ్యాయులు తోటకూర సాయిరామకృష్ణ, హెచ్‌ఎంలు, సిఆర్‌పిలు పాల్గొన్నారు.

చంద్రశేఖరరావు దాతృత్వాన్ని కొనసాగించాలి


దుప్పట్లు పంపిణీ చేస్తున్న మంత్రి వేణు, ఎంఎలఎ రాజా

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

నున్న చంద్రశేఖరరావు దాతృత్వాన్ని అందరూ కొనసాగించాలని బిసి సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ పిలుపు ఇచ్చారు. తిరుమల విద్యాసంస్థల ఛైర్మన్ నున్న తిరుమలరావు తండ్రి నున్న చంద్రశేఖరరావు ఇటీవల మరణించిన సంగతి విదితమే. పితవియోగంతో బాధపడుతున్న తిరుమలరావును మంత్రి వేణు, ఎంఎల్ఎలు జక్కంపూడి రాజా, గోరంట్ల బుచ్చియ్య చౌదరితో కలిసి గురువారం పరామర్శించారు. అనంతరం కాతేరులోని తిరుమల రావు స్వగృహంలో చంద్రశేఖరరావు పెద్దకార్యంలో వారు పాల్గొని ఆయన ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన కుమారులైన తిరుమలరావు, కృష్ణ, సురేశ్‌ను పరామర్శించారు. అనతంరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి వేణు, ఎంఎల్ఎలు పేదలకు దుప్పట్లు పంచి పెట్టారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నున్న చంద్రశేఖరరావు సేవాగుణాన్ని మనం కూడా కొనసాగించాలన్నారు. ఎంయల్ఎ జక్కంపూడి రాజా మాట్లాడుతూ తిరుమల విద్యాసంస్థల అధినేత తిరుమలరావు విద్యాసంస్థను స్థాపించి ఎంతోమంది విద్యార్థులను గొప్ప ఇంజనీర్లుగా, డాక్టర్లుగా తీర్చిదిద్దుతున్నారన్నారు. ఆయన తండ్రి ప్రోత్సాహంతో ఎన్నో రక్తదాన శిబిరాలను, సేవా కార్యక్రమాలు చేస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆదిరెడ్డి అప్పారావు, మాజీ ఎంయల్ఎ బూరుగుపల్లి శేషారావు, జక్కంపూడి గణేష్, శశి విద్యాసంస్థల ఛైర్మన్ బూరుగుపల్లి వేణుగోపాలకృష్ణ, కంటిపూడి సర్వారాయుడు, చెరుకూరి వీర్రాజు, బత్తుల బలరామకృష్ణ, శశి విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్ బి.రవి కుమార్, గన్ని కృష్ణ, టిడిపి రాజానగరం ఇన్‌ఛార్జి బొడ్డు వెంకటరమణ చౌదరి, కావూరి రవి, ఉండవల్లి ఉండవల్లి రాము, ఇమ్మని రామకృష్ణ, ఉప్పులూరి సత్యనారాయణ, పలువురు డాక్టర్లు, పుర ప్రముఖులు పాల్గొన్నారు.

ఇంధన వనరులను పొదుపుగా వినియోగించుకోవాలి



ర్యాలీకి జెండా ఊపి ప్రారంభిస్తున్న కలెక్టర కృతికా శుక్లా

ప్రజాశక్తి- కాకినాడ

ప్రకృతి ప్రసాదించిన ఇంధన వనరులను పొదుపుగా వినియోగించుకోవడం ద్వారా భావితరాలకు అందించడమే కాకుండా పర్యావరణాన్ని కాపాడుకోవచ్చని కలెక్టర్ డాక్టర్ కృతికాశుక్లా అన్నారు. గురువారం జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలను పురస్కరించుకుని కాకినాడ జిల్లా విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం నుంచి ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. బాలాజీ చెరువు కూడలి వరకు నిర్వహించిన ఈ ర్యాలీలో విద్యుత్ ఉద్యోగులు, వినియోగదారులు, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు. ఇంధన పొదుపుపై ప్రజలకు అవగాహన కల్పించే నిమిత్తం రూపొందించిన ప్రచార కరపత్రాలను కలెక్టర్ ఈ సందర్భంగా ఆవిష్కరించి మాట్లాడారు. జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా ఈ నెల 14 నుంచి 20వరకు జిల్లాలో వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. విద్యుత్‌ను ఆదా చేసేందుకు ప్రస్తుతం మార్కెట్లో అనేక ఎలక్ట్రికల్ ఉపకరణాలు అందుబాటులోకి వచ్చాయని ఆమె తెలిపారు. పర్యావరణం దృష్ట్యా భావితరాల భద్రత కోసం ఇంధనాన్ని పొదుపుగా ఉపయోగించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. ఇంధన పొదుపు ఒక సామాజిక బాధ్యతగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఇఇ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. విద్యుత్ పొదుపు వంటి అంశాలపై పాఠశాలల విద్యార్థులకు పెయింటింగ్, వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

ఆరోగ్య పథకాలపై అవగాహన పెంచుకోవాలి


బాలింతలు, గర్భిణీలకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ విజయ్ ప్రదీప్

ప్రజాశక్తి - పెద్దాపురం

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరోగ్య పథకాలపై గర్భిణీలు, బాలింతలు అవగాహన పెంచుకోవాలని డాక్టర్ విజయ్ ప్రదీప్ అన్నారు. మండలంలోని కొండపల్లి గ్రామంలో గురువారం గర్భిణీలు, బాలింతలకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం గర్భిణీలు, బాలింతల ఆరోగ్య పరిరక్షణకు అనేక పథకాల ద్వారా సేవలందిస్తుందన్నారు. ఈ సందర్భంగా ఆయన గర్భిణీలు, బాలింతలకు పౌష్టికాహారం అవసరాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సైకాలజిస్ట్ డాక్టర్ కె దేవి శ్రీనివాస్, హెల్త్ సూపర్వైజర్ రామ్మోహనరావు, హేమలత, దువ్వా గంగాభవాని, ఆశా వర్కర్ లక్ష్మీపార్వతి, ఎస్తేరు రాణి, దువ్వా వెంకటపతి తదితరులు పాల్గొన్నారు.

మోరాయిస్తున్న సర్వర్లు

-రేషన్ కోసం తప్పని లబ్ధిదారుల పడిగాపులు

ప్రజాశక్తి - సామర్లకోట రూరల్

రేషన్ దుకాణాల ద్వారా ప్రజలకు ఇంటింటా అందించే సరుకుల విషయంలో లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. పట్టణంలోని అమ్మానమ్మ అపార్ట్మెంట్లో రేషన్ బియ్యం తదితర సరుకుల కోసం గంటల తరబడి మహిళలు ఎండలో పడిగాపులు పడ్డారు. రేషన్ సరుకులు అందించే వాహనంలో ప్రజలు ఆధార్ కార్డు అనుసంధానం ద్వారా పొందుతున్న బియ్యానికి సంబంధించి ఆన్‌లైన్ సర్వర్ మోరాయించింది. లబ్ధిదారుల వేలిముద్రలు వేసే పరికరం పనిచేయకపోవడంతో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు మహిళలు వాహనం వద్ద బారులు తీరి నిలబడి తీవ్ర ఇబ్బంది పడ్డారు. ఇంటింటికి అందించాల్సిన రేషన్ బియ్యం ఆయా సెంటర్లలో మాత్రమే వాహనాన్ని పెట్టి ఇస్తుండడంతో వాటిని ఇంటి వరకు తీసుకెళ్లేందుకు ఇబ్బందులు ఎదురవుతున్నట్టు మహిళలు వాపోతున్నారు.


సర్వర్ పనిచేయకపోవడంతో ఎదురుచూస్తున్న లబ్ధిదారులు

అభ్యంతరాల పరిష్కారానికి కృషి



అధికారులను ఆదేశిస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా, చిత్రంలో జెసి ఇలక్కియా

ప్రజాశక్తి-కాకినాడ

ప్రత్యేక సంక్షిప్త సవరణ-2024 రూపకల్పనలో భాగంగా ముసాయిదా ఓటర్ల జాబితాపై నమోదైన అభ్యంతరాల పరిష్కారానికి ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్(ఇఆర్ఒ) అధికారులు ప్రత్యేక కృషి చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో ఎస్ఎస్ఆర్-2024 కార్యకలాపాలపై జెసి ఎస్.ఇలాక్కియా, ఇఆర్ఒలతో ఆమె సమావేశం నిర్వహించారు. ఆయా నియోజకవర్గాలకు సంబంధించి మార్పులు, చేర్పులు, తొలగింపు, అభ్యంతరాల పరిష్కారం, ఇవిఎం స్టోరేజ్ పాయింట్ల గుర్తింపు, ఫారెం 6, 7, 8ల పరిష్కారం, క్లెయిమ్స్ డిస్పోజల్, ఈపీ, జెండర్ రేషియో, టెక్నికల్ సమస్యలు వంటి అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎస్ఎస్ఆర్-2024 రూపకల్పంలో భాగంగా ముసాయిదా ఓటర్ల జాబితాపై నమోదైన దరఖాస్తుల పరిష్కారంపై దృష్టి పెట్టాలన్నారు. క్లెయిమ్‌లు, అభ్యంతరాలను తప్పనిసరిగా నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని స్పష్టం చేశారు. ఓటు హక్కు వినియోగంపై చైతన్య కార్యక్రమాలను నిర్వహించాలన్నారు.

కార్మికుల హక్కులపై అవగాహన



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న సివిల్ జడ్జి ప్రత్యూష కుమారి

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం రూరల్

పరిశ్రమల్లో కార్మికుల హక్కులపై గురువారం న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యాన అవగాహన సదస్సు నిర్వహించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జ్ కె.ప్రత్యూష కుమారి కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం రూపొందించబడిన వివిధ చట్టాల గురించి వివరించారు. పని ప్రదేశాల్లో కార్మికులకు కనీస సదుపాయాలు కల్పించడం, భద్రతా ప్రమాణాలు పాటించడం, హానికారక పరిస్థితుల్లో పని చేస్తున్న వారికి తరచుగా వైద్య పరీక్షలు చేయించడం పరిశ్రమల యాజమాన్యాల బాధ్యత అని చెప్పారు. కర్మాగారాల చట్టం, 1984 ప్రకారం సంబంధిత జిల్లా మేజిస్ట్రేట్, ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫాక్టరీస్ తమ అధికారిక పరిధిలో ఉన్న ఏ కర్మాగారాన్ని అయిన ఎప్పుడైనా తనిఖీ చేసేందుకు, ప్రమాదాలకు దారి తీసే యంత్రాలను స్వాధీనం చేసుకునేందుకు, రిజిస్టర్లు, ఇతర డాక్యుమెంట్లను పరిశీలించేందుకు పూర్తి అధికారం కలిగి ఉంటారని వివరించారు. యాజమాన్యాలు వారి బాధ్యతలు సక్రమంగా నిర్వర్తించనిచో చట్ట పరమైన చర్యలు తప్పవన్నారు. ఈ సదస్సులో రాజమహేంద్రవరం అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ బిఎస్ఎం.వలి, ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫాక్టరీస్ జి.స్వాతి, వివిధ కర్మాగారల యజమానులు, కార్మికులు పాల్గొన్నారు.

16న మెగా జాబ్ మేళా

ప్రజాశక్తి-నల్లజర్ల

నిరుద్యోగ యువతకు ఉద్యోగ కల్పనలో భాగంగా మండల, నియోజకవర్గ స్థాయిలో జాబ్ మేళాలు నిర్వహిస్తున్నట్టు జెసి ఎన్.తేజ్‌భరత్ పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్‌లో జాబ్ మేళాకు సంబంధించిన పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ నెల 16న వికాస, వన్ టీమ్ దూబచర్ల ఆధ్వర్యంలో 25 ఎంఎన్‌సి కంపెనీలతో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు తెలిపారు. టెక్నికల్, నాన్ టెక్నికల్, ఐటి, ఫార్మా, హెల్త్ కేర్, బ్యాంకింగ్ వంటి వివిధ రకాల విభాగాల్లో 25 కంపెనీ లలో 1,500 ఉద్యోగాలు ఉన్నాయని ఆసక్తి గల అభ్యర్థులందరూ నవంబర్ 16 వ తేదీ శనివారం ఎలైట్ జూనియర్, డిగ్రీ కళాశాల దుబచర్లలో ఉదయం 9 గంటలకు సర్టిఫికేట్ జెరాక్స్‌తో హాజరు కావాలని సూచించారు.

గండేపల్లిలో మసీదు ప్రారంభం


మసీదులో ప్రార్థనలు చేస్తున్న ముస్లీంలు

ప్రజాశక్తి - గండేపల్లి

గండేపల్లిలో జాతీయ రహదారిని అనుకుని ఉన్న పాత మసీదును ముస్లిముల ఆధ్వర్యంలో పున్ణప్రారంభించారు. రాజమండ్రి, రాజానగరం, గండేపల్లి గ్రామాలకు సంబంధించిన కొంతమంది విరాళాలతో ఈ మసీదును నిర్మించారు. ఈ సందర్భంగా ఎస్‌కె.ఇబ్రహీం, ఆసిఫ్, అబూబకర్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు పసుమర్తి రాంబాబు, తొండాపు రమణారెడ్డి, ఎడ్ల తాతారావు, ముంగర సూర్యారావు, కర్రి గణేష్, తొండాపు రఘు పాల్గొన్నారు.

యానాం వార్తలు

లబ్ధిదారుల జాబితా కలెక్టర్‌కు అందజేత



ప్రజాశక్తి - యానాం

సముద్రంలో ఒఎన్‌జిసి వేస్తున్న రెండో గ్యాస్ పైపులైన్ వల్ల నియోజకవర్గంలో ఉపాధి కోల్పోయిన లబ్ధిదారుల జాబితాను పుదుచ్చేరి కలెక్టర్‌కు నివేదించినట్లు ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ తెలిపారు. స్థానికంగా బుధవారం ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జాబితా-ఎ, బిలు కలిపి 5,462 మందికి రూ.132 కోట్ల 36 లక్షల 75 వేల 880 లబ్ధిదారులకు ఇవ్వనున్నట్లు తెలిపారు. నష్ట పరిహారం అందుకునే లబ్ధిదారుల సంఖ్య 4,570 మందిగా గుర్తించారని, వీరిలో పురుషులు 4,067 మంది, 503 మంది మహిళలు ఉన్నారని తెలిపారు. వీరికి నెలకు రూ.11,500 చొప్పున వారి బ్యాంక ఖాతాల్లో జమ అవుతాయని చెప్పారు. నష్టపరిహారానికి సిఫార్స్ చేసిన బి జాబితాలో 892 మందిని చేర్చినట్లు తెలిపారు. చిన్న వయసు కల్గిన 66 మందికి రూ. కోటి 24 లక్షల 94 వేల 20లు, విద్యార్థులు కాని వారు 182 మందికి రూ.4 కోట్ల 38 లక్షల 43వేల 60లు, ప్రాజెక్టు అమలు చేసే సమయంలో సొసైటీలు, అండర్ టేకింగ్‌లు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులుగా ఉన్న 21 మందికి రూ.35 లక్షల 9 వేల 800లు, ఒంటరి మహిళలకు, పరస్పరం విడిగా ఉంటున్న మహిళలు 24 మందికి రూ. 60 లక్షల 72 వేలు, డూప్లికేషన్ కేసులు 115 మందికి రూ.2 కోట్ల 90 లక్షల 95 వేలు, లేబర్ ఆఫీసులో నమోదు చేసుకున్న 173 మందికి రూ.4 కోట్ల 37 లక్షల 69 వేలు, ఫిషింగ్ కాకుండా ఇతర వృత్తులు చేసే 311 మందికి రూ.7 కోట్ల 86 లక్షల 83 వేలు పరిహారం అందించడం జరుగుతుందని తెలిపారు.

కొనసాగుతున్న తపాలా ఉద్యోగుల సమ్మె



ఆందోళన చేస్తున్న తపాలా ఉద్యోగులు

ప్రజాశక్తి - యానాం

డిమాండ్ల సాధన కోసం గ్రామీణ తపాలా ఉద్యోగులు చేపట్టిన సమ్మె కొనసాగుతోంది. ఈ సమ్మె లో కాకినాడ డివిజన్ సహాయ కార్యదర్శి ముమ్మిడివరపు బుల్లియ్య పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ న్యాయపరమైన డిమాండ్లు వెంటనే అమలు చేయాలని కోరారు. గ్రామీణ తపాల ఉద్యోగులకు సివిల్ సర్వెంట్ హోదా కల్పించి ఎనిమిది గంటల పని, మెడికల్‌కి రూ.5 లక్షలు, పెన్షన్ రూ.ఐదు లక్షలు కల్పించాలని డిమాండ్ చేశారు. డిమాండ్లు అమలు చేసే వరకూ నిరవధిక సమ్మెను విరమించేది లేదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బిపిఎం నాగేశ్వరరావు, సుబ్బారావు, శశి, దివ్యకుమార్, దుర్గాలక్ష్మి, భాను తేజ, భవాని శంకర్, అభి, స్వాతి పాల్గొన్నారు.

జనవరి 14 నుంచి బీచ్ ఫెస్టివల్

ప్రజాశక్తి - యానాం

పుదుచ్చేరి పర్యాటకశాఖ ఆధ్వర్యంలో యానాంలో జనవరి 14,15,16 తేదీల్లో మూడు రోజుల పాటు బీచ్ ఫెస్టివల్, ఫ్లవర్ షో నిర్వహిస్తామని ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ మూడు రోజుల పాటు నిర్వహించే ఈ కార్యక్రమాలు స్థానిక గౌతమీ గోదావరి రాజీవ్ రివర్ బీచ్ వద్ద జరుగుతాయన్నారు. భారతీయ సంస్కృతిని ప్రతిబింబించే పలు కార్యక్రమాలు ఉంటాయన్నారు. వీటిని విజయవంతం చేసేందుకు అధికారులు సహకరించాలన్నారు.

గృహ నిర్మాణ లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ


లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తున్న ఎంఎల్ఎ

ప్రజాశక్తి - యానాం

పుదుచ్చేరి ప్రభుత్వం స్లమ్ క్లియరెన్స్ బోర్డు ఆధ్వర్యంలో పిఎం ఆవాస్ యోజన పథకంలో గృహ నిర్మాణ లబ్ధిదారులకు మంజూరైన చెక్కులను గురువారం ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్ పంపిణీ చేశారు. మొదటి, రెండవ, మూడో విడతకి సంబంధించి సుమారు 31 మందికి రూ.34.30 లక్షల విలువ చేసే చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రాంతీయ పరిపాలనాధికారి ఆర్.మునిస్వామి, పుదుచ్చేరి స్లమ్ క్లియరెన్స్ బోర్డు అధికారులు పాల్గొన్నారు.